


మొలకెత్తిన ధాన్యం.. రైతు కళ్లలో దైన్యం 2



శ్రీరాంసాగర్‌కు భారీ వరద 2



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND


www.aksharatoday.in

1-11-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్‌గా డీఆర్వోకు బాధ్యతలు



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారికి స్థానిక సంస్థల ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని సూచించారు.



## లింబాద్రి గుట్టపై కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

**అక్షరటుడే, భీమ్‌గల్ :** భీమ్‌గల్ శివారులోని శ్రీ మన్నింబాచల క్షేత్రం లింబాద్రిగుట్టపై లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. కొండపై మొదటి అంతస్తులో ఉన్న కళ్యాణ మండపంలో లక్ష్మీ నృసింహస్వామి ఉత్సవమూర్తులకు ఆలయ పండితులు హవనం, బలిప్రదానం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. గర్భాలయంలో ఉదయం సుప్రభాత సేవతో మొదలుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నంబి పార్థసారథి, విజయసారథి, ప్రణీత్, నారాయణ, మహేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక పౌర్ణమికి అరుణాచలానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సు



**అక్షరటుడే, ఇందూరు:** కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని నిజామాబాద్ నుంచి ఈనెల 3న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆర్ఎం జ్యోత్స్న తెలిపారు. నిజామాబాద్ బస్టాండ్ నుంచి 3న మధ్యాహ్నం మూడు గంటలకు బస్సు బయలుదేరుతుందని పేర్కొన్నారు. కాణిపాకం, వెల్లూరు గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, కంచి, జోగులాంబ, బీచుపల్లి హనుమాన్ ఆలయం దర్శనాలను చేసుకోవచ్చన్నారు. తిరిగి 7వ తేదీ తెల్లవారుజామున బస్సు నిజామాబాద్ చేరుకుంటుందని పేర్కొన్నారు. వివరాలకు వెబ్‌సైట్ www.tgsrtcbus.in ద్వారా లేదా సమీప బస్టాండ్ రిజర్వేషన్ కౌంటర్‌లో బస్సు సర్వీస్ నెంబర్ 98883తో టికెట్ పొందవచ్చన్నారు. పూర్తి వివరాలకు 7382840367, 9490410939 నంబర్లను సంప్రదించాలన్నారు.



## 15న స్పెషల్ లోక్ అదాలత్ : జిల్లా జడ్జి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** స్పెషల్ లోక్ అదాలత్‌ను నవంబర్ 15న కోర్టు ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ జీవీఎన్ భరతలక్ష్మి తెలిపారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని తన ఛాంబర్‌లో శనివారం సీపీసాయిచైతన్య, న్యాయసేవ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్ రావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. జిల్లాలో 1,328 క్రిమినల్ కేసులను గుర్తించామని తెలిపారు. వాటికోసం లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. విబేధాలు వచ్చినప్పుడు సర్దుకుని రాజీ మార్గంలో వెళ్లడమే ఉత్తమమని ఆమె పేర్కొన్నారు. ఆర్మూర్, బోధన్ కోర్టు ప్రాంగణాలతో పాటు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో ప్రత్యేక లోక్ అదాలత్ జరుగుతుందని చెప్పారు.

నిజామాబాద్ జిల్లాలో వరుస హత్యలు కలకలం రేపుతున్నాయి. వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు మహిళలు హత్యకు గురవడం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా ఓ మహిళను దుండగులు దారుణంగా హతమార్చారు. ఆమె తల, చేయి నరికివేసి మృతదేహాన్ని పడేశారు. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. - అక్షరటుడే, ఇందూరు

# వరుస హత్యల కలకలం



▸ నవీపేట మండలంలో మహిళ దారుణ హత్య ▸ తల వేరు చేసి మృతదేహాన్ని పడేసిన వైనం ▸ వారం వ్యవధిలో రెండు మర్డర్లు

నవీపేట్ మండలంలో ఓ మహిళను దుండగులు దారుణంగా హత్య చేశారు. మండలంలోని ఫకీరాబాద్ నుంచి మిట్టాపూర్ వెళ్లే దారిలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మహిళను వివస్త్రను చేసి దారుణంగా హతమార్చారు. ఆమె శరీరం నుంచి తలను వేరు చేశారు. మొండాన్ని ఇక్కడ పడేశారు. ఆమె చేయిని సైతం దుండగులు మణికట్టు వరకు నరికి వేశారు. మరో చేతి వేళ్లు కట్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సీపీ సాయి చైతన్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా.. శుక్రవారం రాత్రి హత్య జరిగినట్లు అనుమానిస్తున్నారు. అయితే ఇక్కడే హత్య చేశారా.. ఎక్కడైనా చంపి మృతదేహాన్ని ఇక్కడకు తెచ్చి పడేశారా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### పది బృందాల ఏర్పాటు

మహిళ హత్య ఘటన జిల్లా వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. సీపీ సాయి చైతన్య ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో వివరాలు సేకరించారు. నిందితులను పట్టుకోవడానికి సీపీ 10 ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి , నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, నవీపేట ఎస్సై తిరుపతి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

### నెలలో రోజుల్లో మూడు హత్యలు

జిల్లాలోని నవీపేట మండలంలో నెల రోజుల వ్యవధిలో మూడు హత్యలు జరగడంతో అక్కడి ప్రాంతం వారు ఆందోళనకు గురవుతున్నారు. మహారాష్ట్రకు సమీపంగా ఉన్న మండలం కావడంతో పలు అంశాలు తెరపైకి వస్తున్నాయి. ఎక్కడో హత్య చేసి, ఇక్కడ వదిలారా.. బంగారు ఆభరణాల కోసమా.. ఇంకా ఏవైనా కారణాలు ఉన్నాయా అంటూ చర్చించుకుంటున్నారు. అక్టోబర్ 24న నిజామాబాద్ బాసర రోడ్డులో రహదారికి వంద మీటర్ల సమీపంలో ఓ మహిళను హత్య చేసి, పెట్రోల్ పోసి తగలబెట్టారు. మృతురాలు మద్దేపల్లి గ్రామానికి చెందిన శ్యామల లక్ష్మిగా గుర్తించారు. అలాగే కామారెడ్డి జిల్లాలోనూ పది రోజుల క్రితం ఓ మహిళపై అత్యాచారం జరిగింది. బీహార్‌కు చెందిన కార్మికుడు ఈ అఘాయిత్యానికి పాల్పడగా కామారెడ్డి పోలీసులు మహారాష్ట్రలో నిందితుడిని అరెస్ట్ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఇటీవల మహిళలపై నేరాలు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.



## బోధన్‌లో విచారణ చేపట్టిన రీజినల్ డైరెక్టర్

**అక్షరటుడే, బోధన్ :** పట్టణంలోని మున్సిపాలిటీలో ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి పనులపై అనేక ఆరోపణలు రావడంతో మున్సిపల్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ షాయద్ మసూద్ విచారణ చేపట్టారు. 2020 నుంచి మున్సిపాలిటీలో అనేక అంశాలలో అవినీతి జరిగిందని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు జునేత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఇంజినీరింగ్ సెక్షన్‌లోనే అనేక ఆరోపణలు వచ్చాయని, గత ప్రభుత్వం చేపట్టిన హరితహారంపై కూడా ఆరోపణలు వచ్చాయని, వీటిపై విచారిస్తున్నామని విలేకరులకు తెలిపారు.



## 3వ తేదీ నుంచి కళాశాలల బంద్

**అక్షరటుడే, ఇందూరు :** ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 3 నుంచి కళాశాలలను బంద్ చేయనున్నట్లు తెలంగాణ యూనివర్సిటీ ప్రైవేట్ కళాశాలల యాజమాన్య అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జైపాల్ రెడ్డి, నరాల సుధాకర్ తెలిపారు. ఈ మేరకు తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రీయింబర్స్ మెంట్ పెండింగ్‌లో ఉండడం వల్ల కళాశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇప్పటికే అధ్యాపకులకు నెలసరి వేతనాలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. గత మూడేళ్ల నుంచి బకాయిలు పేరుకుపోవడంతో కళాశాలల నిర్వహణ కష్టమైపోయిందని వాపోయారు. వినతిపత్రం అందించిన వారిలో కళాశాలల యాజమానులు మారయ్య గౌడ్, శంకర్, గురువేందర్ రెడ్డి, సూర్య ప్రకాష్, శ్రీనివాస్, అరుణ్, గిరి, దత్తు, అనిల్, షకీల్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో పురోగతి సాధించాలి



**అక్షరటుడే, ఇందూరు:** అట్రాసిటీ కేసుల్లో పురోగతి సాధించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్య, ఇతర అధికారులతో శనివారం భేటీ అయ్యారు. ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. సబ్‌ప్లాన్ నిధులు, వివిధ శాఖల ద్వారా షెడ్యూల్డ్ కులాలు, తెగల వారి కోసం వెచ్చిస్తున్న నిధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమోద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విధినిర్వహణలో హత్యకు గురికావడం ఎంతో బాధ కలిగించిందన్నారు. బాధిత కుటుంబానికి కమిషన్ అండగా నిలుస్తుందని, పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా చూస్తామని భరోసా కల్పించారు. ఆయన వెంట ఏసీపీ రాజా వెంకటరెడ్డి, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అభివృద్ధి శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులు ఉన్నారు.

### బాధితురాలి కుటుంబానికి అండగా ఉంటాం:ఎస్సీ కమిషన్


**అక్షరటుడే, కామారెడ్డి :** అత్యాచారానికి గురైన బాధిత మహిళ కుటుంబానికి అండగా ఉంటామని ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. పాల్వంచ మండలం ఫరీద్‌పేట గ్రామానికి చెందిన మహిళ అత్యాచారం ఘటన విషయం తెలుసుకున్న ఆయన శనివారం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బాధిత మహిళను పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, గ్రామస్థుల ద్వారా ఆరా తీశారు. బాధితురాలికి పరిహారం అందించడానికి ఉన్న మార్గాలను చూడాలని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు.

## మున్సిపల్ ఫండ్స్‌ను సక్రమంగా వినియోగించాలి

**అక్షరటుడే, ఇందూరు:** ఇటీవల విడుదలైన మున్సిపల్ ఫండ్స్‌ను అర్బన్ నియోజకవర్గంలో సక్రమంగా వినియోగించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. నగరంలోని సమీకృత కార్యాలయాల భవనంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి వివిధ శాఖల అధికారులతో శనివారం సమీక్షించారు. ప్రధానంగా నగరంలో వీధిదీపాలు వెలగడం లేదని.. వెంటనే కొత్తలైట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అదనపు తరగతి గదుల నిర్మాణం, ఇతర సౌకర్యాలపై ప్రతిపాదనలు తక్షణమే అందజేయాలని తెలిపారు. రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు ఆలస్యం అవుతున్నాయని, వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎల్లమ్మగుట్టలోని సోనీ ఫంక్షన్ హాల్ పక్కన బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. వైద్యశాఖ అధికారులకు ఎమ్మెల్యే, కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఇటీవల వైద్యశాఖకు మంజూరైన రూ.2.25 కోట్ల నిధులతో చేపట్టాల్సిన పనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. టెండర్ ప్రక్రియను వేగవంతం చేసి పనులను ప్రారంభించాలన్నారు. అలాగే చెరువులు, కుంటలపై జరిగిన ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు.




## దర్జాగా నాన్ లే అవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్..



■ సబ్ రిజిస్ట్రార్ నిర్వాకం ■ ఉన్నతాధికారులు స్పందించేనా..!

**అక్రమ ప్లాట్ల రిజిస్ట్రేషన్ కట్టడికి ప్రభుత్వం ఎన్ని రకాల చర్యలు తీసుకుంటున్నా.. ఫలితం ఉండడం లేదు. ఈ విషయంలో తప్పనిసరిగా డీటీసీపీ అనుమతులు తీసుకోవాలని నిబంధన విధించింది. మరోవైపు నాన్ లే అవుట్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయొద్దని సబ్ రిజిస్ట్రార్లను ఆదేశించింది. కానీ.. కొందరు సబ్ రిజిస్ట్రార్లు అక్రమార్జనకు అలవాటు పడి దర్జాగా నాన్ లే అవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.** - అక్షరటుడే, నిజామాబాద్

నిజామాబాద్ అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలో పని చేస్తున్న సబ్ రిజిస్ట్రార్లు నిబంధనలు ఏమీ లెక్కచేయడం లేదు. నాన్ లే అవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు సైతం చేసి పెడుతున్నారు. భూ భారతిలో ఉన్న భూమిని కేవలం నాలా పత్రం ఆధారంగా ప్లాట్లుగా రిజిస్ట్రేషన్లు చేసి పెట్టడం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు సమాచారం. నగరంలోని రోటరీ నగర్ సమీపంలో గల 12 గుంటల వ్యవసాయ భూమికి ఇటీవల రిజిస్ట్రేషన్లు పూర్తి చేసి పెట్టారు. ఓ సర్వే నంబర్‌లో పట్టాదారుకు భూ భారతిలో 12 గుంటల భూమి ఉండగా.. కేవలం నాలా పత్రాల సాయంలో ఏడు ప్లాట్లుగా విభజించారు. 8585, 8586, 8578, 8579 నంబర్లతో కలిగిన డాక్యుమెంట్లను అక్టోబర్ 10న పూర్తి చేశారు.

### కొరవడిన పర్యవేక్షణ

జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ లే అవుట్‌లకు సంబంధించి దర్జాగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. నిజామాబాద్‌లో డీఐజీ, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఇరువురు అధికారులు ఉన్నప్పటికీ సబ్ రిజిస్ట్రార్‌లపై పర్యవేక్షణ కొరవడింది. ఫలితంగా నాన్ లే అవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు మూడు పువ్వులు, ఆరు కాయలు అన్న చందంగా జరుగుతున్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా అర్బన్‌లో జరిగిన రిజిస్ట్రేషన్ల వ్యవహారంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.



## ఛలో హైదరాబాద్‌కు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

**అక్షరటుడే, ఇందల్వాయి:** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా నాయకులు ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు కిష్టయ్య మాట్లాడుతూ.. ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ పై జరిగిన దాడిని ఖండిస్తూ ఇందల్వాయి టోల్‌ప్లాజా నుంచి హైదరాబాద్‌కు వెళ్లి అక్కడ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని కాపాడుకునే క్రమంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నామని ఆయన వివరించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచి వందల సంఖ్యలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు తరలివెళ్తినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గంధమాల నాగభూషణం, ధర్పల్లి మండల ఇన్‌ఛార్జి నక్క రాజేందర్, డిచ్‌పల్లి ఇన్‌ఛార్జి డప్పు నర్సయ్య, సిరికొండ మండల అధ్యక్షుడు దీపక్, శ్రీ రాములు తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాలకు విరాళం అందజేత

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండలంలోని అమీర్‌నగర్ గ్రామానికి చెందిన తోట మహేష్ తన కుమారుడు అద్వైత్ పుట్టినరోజు సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు రూ.10వేల విరాళం అందజేశారు. తోట మహేష్ బషీరాబాద్ స్కూల్‌లో ఎస్జీటీగా పనిచేస్తున్నాడు. ఈ సందర్భంగా విరాళం అందజేసిన మహేష్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలోని జంబి హనుమాన్ ఆలయంలో శనివారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. మూడేళ్లుగా ఆలయంలో ప్రతి వారం హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్నట్లు భక్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రమణయ్య, ఉట్నూరు రాజశేఖర్, భోగ రామస్వామి, రమేష్, నరేందర్, చింత ప్రవీణ్, శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.



## అమరవీరుల స్ఫూర్తితో విప్లవోద్యమాలు

**అక్షరటుడే, ఆర్మూర్:** అమరవీరుల స్ఫూర్తితో బలమైన విప్లవోద్యమాలను నిర్మిద్దామని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ, డివిజన్ కార్యదర్శి బి దేవారం పిలుపునిచ్చారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో అమరవీరుల వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కామ్రేడ్లు రాయల రవన్న, డీవీ కృష్ణ, యాదగిరన్న చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా, డివిజన్, మండల నాయకులు ముత్తెన్న, సురేష్, రాజేశ్వర్, కిషన్, సత్తెవ్వ, కిషన్, దామోదర్, అరవింద్, కిశోర్, పద్మ, శ్రీనివాస్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్, జిల్లా అధ్యక్షుడు ఎం. నరేందర్, ఏరియా అధ్యక్షుడు కె.నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# మొలకెత్తిన ధాన్యం..
# రైతు కళ్లలో దైన్యం

అకాల వర్షాలు రైతన్నకు తీరని శోకాన్ని మిగిల్చాయి. చేతికందిన పంట కళ్లముందే తడిసిపోతుండడంతో ఏమీ చేయలేని దుస్థితిలో అన్నదాతలు అయోమయంలో పడ్డారు. జిల్లాలో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టే సమయంలో మొంథా తుపాను నిండా ముంచింది. డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లిలో ఓ రైతు తన ఐదెకరాల ధాన్యాన్ని రోడ్డుపై ఆరబెట్టగా వర్షానికి ధాన్యంలో మొలకలు వచ్చాయి. ఇలా అనేక మంది రైతుల ధాన్యం తడిసి నష్టపోయారు.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్







## అదనపు తరగతి గది ప్రారంభం



**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని ముచ్కూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదులను ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల ఓ గది అసంపూర్తిగా ఉండడంతో రూ. 1.25 లక్షల మండల పరిషత్ నిధులు మంజూరు చేశామన్నారు. వాటితో నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు. కార్యక్రమంలో ముచ్కూర్ రైతు సేవా సహకార పరపతి సంఘం ఛైర్మన్ దేవేందర్, ఎంఈవో స్వామి, ఏఈ విక్రమ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, హారిక, వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని ఆర్మూర్ గల్లీలో శనివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మొత్తం 182 పశువులకు (ఆవులు, గేదెలు) టీకాలు వేశారు. జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ రోహిత్ రెడ్డి శిబిరాన్ని తనిఖీ చేశారు. పాడిరైతులకు గాలికుంటు వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నవంబర్ 3న బాల్కొండ గ్రామంలోని పోచమ్మ గల్లీలో గాలికుంటు నివారణ టీకాలు వేస్తామని పశువైద్యాధికారి గౌతమ్ రాజు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు పోతలింగం, గంగారం, రాజన్న, శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ వైద్యులు గౌతమ్ రాజు, ఉజ్వల, ప్రవీణ్, ప్రణీత్ (గోపాల మిత్ర), మల్లేశ్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

## జోనల్ స్థాయి క్రీడాకారుల ఎంపిక



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం కమ్మర్‌పల్లి జోనల్ స్థాయి అండర్-14, అండర్-17, బాలబాలికల వాలీబాల్, కబడ్డీ జట్లను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కన్వీనర్ పి సాయన్న, జోనల్ సెక్రటరీ వేముల నాగభూషణం, మోర్తాడ్, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి మండలాలకు చెందిన వివిధ పాఠశాలల పీడీలు, పీఈటీలు ఆనంద్,శ్యామ్, నగేష్, మాధురి, గోపాల్, జ్యోతి, రమేష్‌గౌడ్, బాలు, సంజీవ్, ప్రేమ్ కుమార్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి



**అక్షరటుడే, ఇందూరు:** ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా రెండో ఉప గవర్నర్ డి.నర్సింహరాజు అన్నారు. ప్రపంచంలోనే సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్‌లు ముందున్నాయని ఆయన పేర్కొన్నారు. నిజామాబాద్ రీజియన్‌లోని లయన్స్ క్లబ్‌లలో నూతనంగా చేరిన సభ్యులకు శనివారం నగరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా జీఎస్టీ కో-ఆర్డినేటర్ రాంమనోహర్, జీఎల్టీ కో-ఆర్డినేటర్ పద్మావతి, నిజామాబాద్ రీజియన్ ఛైర్మన్ సూర్యభగవాన్, కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు, జిల్లా ఛైర్మన్ డి యాదగిరి, రీజియన్ పీఆర్వో చింతల గంగాదాస్ పాల్గొన్నారు.

## ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే షీటీంకు సమాచారమివ్వాలి



**అక్షరటుడే, భీమ్‌గల్:** ఆకతాయిలు ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే వెంటనే షీటీంకు సమాచారం ఇవ్వాలని ఆర్మూర్ సబ్‌డివిజన్ షీటీం బృంద సభ్యులు విగ్నేష్, సుమతి సూచించారు. మండలంలోని బడా భీమ్‌గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలు, ఆకతాయిలు ఈవ్ టీజింగ్ చేస్తే ఏం చేయాలనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. షీటీంకు సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. అగంతకులు క్యూఆర్ కోడ్ ద్వారా చీటింగ్‌కు పాల్పడేవిధానాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణస్వామి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## బాల్కొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బెంచీల విరాళం



**అక్షరటుడే, బాల్కొండ:** మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు దయానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో డెస్క్ బెంచీలు అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు దయానంద రెడ్డి 25 డ్యూయల్ డెస్క్ బెంచీలను శనివారం అందించారు. ఈ సందర్భంగా కళాశాల తరపున ప్రిన్సిపాల్ వై వేణు ప్రసాద్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రజీయుద్దీన్ అస్లాం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కళాశాల భవన నిర్మాణం కోసం తహశీల్దార్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు స్థల పరిశీలన చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన డిగ్రీ కళాశాలలో అన్ని వసతులు కల్పించేందుకు దాతలు ముందుకు రావాలని, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## యువతను సన్మార్గంలో పెట్టే బాధ్యత తల్లిదండ్రులదే..



**అక్షరటుడే, ఆర్మూర్:** సమాజంలో యువత గంజాయికి బానిసలై చెడుమార్గం పట్టకుండా చూసుకోవాల్సిన బాధ్యత ముందుగా తల్లిదండ్రులదేనని ఈఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ అన్నారు. సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యుడు పల్లె నరసింహ బృందం ఆధ్వర్యంలో తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆర్మూర్ పట్టణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ బస్సు కళాజాత అక్టోబర్ 27 నుంచి నవంబర్ 2 వరకు హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వరకు నిర్వహిస్తున్నారు. కాగా.. శనివారం ఈ బస్సుయాత్ర ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్‌కు చేరుకుంది. కాగా.. ఈరవత్రి రాజశేఖర్ వారికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జననాట్యమండలి ప్రతినిధులు, బట్టు శ్రీధర్, నారాయణ, లక్ష్మీనారాయణ, ఈఆర్ ఫౌండేషన్ సభ్యులు కుండ రాంప్రసాద్, కొండి రామచంద్ర, నూకల శేఖర్, ఇట్టెం రాంప్రసాద్, ఇంతియాజ్, నవీన్, టైలర్ వినోద్, భవాని శ్రావణ్, రాజేశ్వర్ గౌడ్, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీకి భారీ వరద.. 16 గేట్లు ఎత్తివేత

**అక్షరటుడే, మెండోరా/ఎల్లారెడ్డి :** మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు వరద భారీగా వచ్చి చేరుతోంది. ఇన్‌ఫ్లో క్రమంగా వస్తుండడంతో అధికారులు 16 గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్‌లోకి ప్రస్తుతం 56,513 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో 16 వరద గేట్ల ద్వారా అంతేస్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువ, లక్ష్మి కాల్వలకు నీటి విడుదలను నిలిపివేశారు.

ఎస్కేప్ గేట్ల ద్వారా 8000 క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 650, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 573 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం అంతేస్థాయిలో నీరు నిల్వ ఉంది. గోదావరిలోకి నీటి విడుదల కొనసాగుతుండడంతో నదీ పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్ట్ అధికారులు సూచించారు.



### నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి..

నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. జలాశయంలోకి ప్రస్తుతం 35,105 క్యూసెక్కుల వరద వస్తుండగా.. అధికారులు 5 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్‌కు వరద వస్తుండడంతో వరద గేట్ల ద్వారా 43,135 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1,404.76 అడుగుల (17.4 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

## పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి



**అక్షరటుడే, ఆర్మూర్ :** మొంథా తుపాన్ వల్ల నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతుకూలీ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు కూలీ సంఘం నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ.. అకాల వర్షాలతో రైతులు నట్టేట మునిగి ఆందోళన చెందుతుంటే.. పాలకులకు పట్టడం లేదన్నారు. ఆర్మూర్ డివిజన్‌లో సుమారు 50వేల ఎకరాలకు పైగా పంటలు నీటి పాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్టపోతే బీమా సౌకర్యం కూడా లేకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంట నష్టపోయిన వివరాలను సేకరించాలన్నారు. రైతులకు ఎకరానికి రూ.30 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట బీమా పథకాన్ని అమలు చేసి ఆపదలో రైతులను ఆదుకోవాలన్నారు. ఐకేపీ కేంద్రాలలో తడిసిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు భూమన్న, సాయిలు, కుల్దీప్ శర్మ, జన్నపల్లి నడిపి రాజన్న, భామండ్ల రవి తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు బ్లాంకెట్ల పంపిణీ

**అక్షరటుడే, బాల్కొండ:** మండల కేంద్రంలోని ప్రభుత్వ మహిళా బాలికల వసతి గృహంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రజీయుద్దీన్ అస్లాం విద్యార్థులకు ఉచితంగా బ్లాంకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చలికి ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకుని తనవంతు సాయంగా బ్లాంకెట్లు అందజేశానన్నారు. కార్యక్రమంలో రెహమాన్, శ్రీనివాస్, మురళి, యశస్విని పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రిన్సిపాల్ రజీయుద్దీన్‌కు ధన్యవాదాలు తెలిపారు.